## నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం

వెంకటాపూర్ మండలం రామంజాపూర్ గ్రామంలోని ఎరుకల నాంచారమ్మ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ కవిత హామీ ఇచ్చారు. నాంచారమ్మ జాతరకు హాజరై తల్లికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఎరుకలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఎరుకలతో ఎరుక(జోస్యం) చెప్పించుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ జాతర కోసం ఆరు గంటలు పాటు ప్రయాణించి వచ్చానని, నాంచారమ్మ ఆలయ నిర్మాణంతో పాటు జాతరకు ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో నాంచారమ్మ జాతరకు అభివృద్ధికి దృష్టి పెట్టామని తెలిపారు. ఎరుకల కులం వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ ఎంటర్‌ప్రెన్యూర్ పథకాన్ని తీసుకువచ్చారని చెప్పారు. ఆమె వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, మాజీ జడ్పీటీసీలు సకినాల భవాని, గై రుద్రమదేవి అశోక్, మాజీ ఎంపీటీసీ పోశాల అనితావీరమల్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, జిల్లా నాయకులు జంపన్న, పోరిక విజయ్‌రామ్ నాయక్, మల్క రమేశ్, మాజీ సర్పంచ్‌లు జగన్ మోహన్‌రావు, కుమారస్వామి, నాయకులు అంతటి రాము, ప్రభాకర్‌రావు, రవీందర్, రాజు, సత్యం పాల్గొన్నారు.



రామప్పలోని రుద్రేశ్వరస్వామికి పూజలు చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

## పైలట్ గ్రామాల్లోనూ అందని పథకాలు

- అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి, మే 12 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పలు సంక్షేమ పథకాలు పైలట్ గ్రామాల్లో సైతం అమలు కావడంలేదని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. సోమవారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కన్నాయపల్లి గ్రామాన్ని ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందాయా? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో విఫలమైందని ఎద్దేవా చేశారు. మూడు ఎకరాల పైనున్న వారికి రైతు భరోసా దిక్కు లేదని, రుణ మాఫీ పూర్తి కాలేదని, ఇందిరమ్మ ఇండ్లు కేవలం కడియం శ్రీహరి అనుచరులకు మాత్రమే ఇస్తున్నట్లు తెలిసిందన్నారు. తాను అభివృద్ధిని విస్మరించానని కడియం అనడం సిగ్గుచేటని, దమ్ముంటే ఆయన చేసిందేంటో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బొడ్రాయి వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కడియం బీఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మారిన వ్యక్తి అని, ఆయన చేసిన మోసాన్ని నియోజకవర్గ ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని చెబుతుంటే, నియోజకవర్గ అభివృద్ధికి రూ. 200 కోట్లు మంజూరు చేయించానని కడియం చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికీ బీఆర్ఎస్ చేసిన అభివృద్ధే కనిపిస్తున్నదని, కాంగ్రెస్ కొత్తగా చేపట్టిన పనులు ఎక్కడా లేవన్నారు. ఇప్పటికైనా అర్హులకు పథకాలు అందించాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని రాజయ్య హెచ్చరించారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, మండల కోఆర్డినేటర్ విజయ్, కుమారస్వామి, ఆంజనేయులు, సంజీవరెడ్డి, గాలిరెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాస్‌గౌడ్, మహేశ్ ఉన్నారు.

# ఓపెన్ కాస్ట్‌తో రామప్పకు ముప్పు

- రైతులు, ప్రజలు చనిపోతున్నా మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదు
- జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- రామప్పలో పూజలు, ఎరుకల నాంచారమ్మ జాతరలో మొక్కులు



నాంచారమ్మ గుడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

వెంకటాపూర్, మే 12 : రామప్ప దేవాలయాన్ని ఎన్నిసార్లు చూసినా తనివి తీరదని, అద్భుతమైన శిల్పకళకు నెలవైన ప్రపంచ వారసత్వ కట్టడమున్న ప్రాంతంలో ఓపెన్‌కాస్ట్ గనులను ఏర్పాటు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోమని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయాన్ని ఆమె సందర్శించగా ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్‌లు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో ఈవో శ్రీనివాస్, అర్చకులు స్వామి వారి శేషావస్త్రాలను బహూకరించారు. అనంతరం మాట్లాడుతూ రామప్ప ఆలయానికి 5 కి.మీల దూరంలో ఓపెన్‌కాస్ట్ మైన్ ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే కేసీఆర్ ఆ ప్రయత్నాన్ని 2012లోనే తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ ఓపెన్ కాస్ట్ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. యునెస్కో గుర్తింపు పొందిన ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ హోదా తెచ్చుకున్నామని, ప్రస్తుత ప్రభుత్వం అప్పటి పనులను పెండింగ్‌లో పెట్టిందని, అందాల పోటీల నేపథ్యంలో పై మెరుగులు దిద్దుతున్నారన్నారు. రైతులు, ప్రజలు చనిపోతున్నా మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదని, ప్రజలపై ప్రతిపక్షలంలో ఉన్నప్పటి ప్రేమ అధికారంలోకి వచ్చాక లేదని విమర్శించారు. కొత్తగా ఒక్క స్కీం కూడా ఇవ్వలేదని, ఉన్న పింఛన్లు పెంచలేదని గత పదేళ్లలో చేసిన అభివృద్ధి తప్ప ఈ ఏడాదిన్నరలో కొత్తగా ఏమీ లేదన్నారు. దేశ సరిహద్దులో ఒక వైపు యుద్ధం జరుగుతుంటే మన సీఎం అందాల పోటీలకు హాజరయ్యారని.. అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంపై లేదన్నారు.



ఎమ్మెల్సీ కవితకు సోది చెబుతున్న యువతులు

### మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

#### సోది చెప్పిన యువతులు

జాతరకు వచ్చిన కవితకు ఎరుకలు సోది చెబుతూ భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీదే అధికారమని, అధికారంలోకి వచ్చాక ఎరుకల నాంచారమ్మ గుడిని పునర్నిర్మాణం చేయాలని కేతిరి సిందూజ, పాలకుర్తి వైష్ణవిలు సోది చెప్పారు. అందుకు ఆమె స్పందిస్తూ తప్పకుండా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, ఆలయానికి ఎల్లవేళలా సహకారం అందిస్తామని మాటిచ్చారు.



కాళేశ్వరంలో జరుగుతున్న పుష్కరాల పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

- ఒక్క వీఐపీలకే సౌకర్యాలు కల్పిస్తే ఎట్లా
- సరస్వతీ పుష్కరాలను నిర్వీర్యం చేస్తున్న ఎమ్మెల్యే
- పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- క్షేత్రస్థాయిలో పలు నిర్మాణాల పరిశీలన

# సామాన్యులు అక్కర్లేదా?

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 12 : సరస్వతీ పుష్కరాలకు వచ్చే సామాన్యులకు కనీస సౌకర్యాలు అక్కర్లేదా? అని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నెల 15 నుంచి 26 వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి నదిలో పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో అక్కడ చేపట్టిన పనులను సోమవారం ఆయన స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మధూకర్ మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో పుష్కరాలు ప్రారంభం కానుండగా ఎక్కడ కూడా పనులు పూర్తి కాలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేనే మంత్రిగా ఉన్నారని, ఆయన సతీమణి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారని, ఇద్దరూ కలిసి సరస్వతీ పుష్కరాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. గోదావరి ఒడ్డున సరస్వతీ అమ్మవారి మండపాన్ని చూస్తే పుష్కర పనులు ఎలా చేస్తున్నారో అర్థమవుతుందన్నారు. ఈ పుష్కరాలు గతంలో రాజమండ్రిలో మాత్రమే జరిగేవని, తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ డిమాండ్ మేరకు కాళేశ్వరం వద్ద 2013లో ఘనంగా జరుపుకున్నామన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత మొదటిసారి జరుపుకునే పుష్కరాలపై స్థానిక ఎమ్మెల్యే పట్టింపులేకుండా ఉన్నారన్నారు. పుష్కరాల నిర్వహణపై ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎమ్మెల్యే పలుసార్లు సమీక్షలు నిర్వహించినప్పటికీ ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయన్నారు. పుష్కరాలకు లక్షలాదిగా తరలివచ్చే సామాన్య భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని, స్నానాలు చేసేందుకు వసతులు లేవని, టాయిలెట్లు, అపరకర్మ మండపం పూర్తికాలేదన్నారు. కేవలం వీఐపీల కోసం మాత్రమే పనులు పూర్తి చేశారని, ఈ పుష్కరాలకు సామాన్యులను అనుమతిస్తారా? లేదా? అనే అనుమానాలున్నాయన్నారు. పనులను నైపుణ్యం లేనివాళ్లకు అప్పగించారని, అధికారులు నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేసేందుకు భయపడుతున్నారని అన్నారు. కమీషన్ల కోసమే పలుమార్లు రివ్యూ మీటింగ్‌లు పెట్టారని, అందువల్లే నాణ్యత లేకుండా పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. జరిగిన పనులకు నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, నిధులు, పనులు, టెండర్ల జారీ ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పుష్కరాలకు వచ్చే సామాన్యులకు సైతం పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని, లేని పక్షంలో తాము బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని మధూకర్ హెచ్చరించారు. ఆయన వెంట రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేశ్, పార్టీ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, మహదేవపూర్, కాళేశ్వరం మాజీ సర్పంచులు శ్రీపతి బాబు, వెన్నపురెడ్డి వసంతా మోహన్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు ఒడేటి స్వప్నా మల్లారెడ్డి, కాళేశ్వర, ముక్తేశ్వర ఆలయ మాజీ చైర్మన్ పోత వెంకటస్వామి, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్, కూరతోట రాకేశ్, కారెంగుల బాపురావు తదితరులు పాల్గొన్నారు.

## టీసీలు తీసుకొమ్మంటున్నరు

- వేరే కళాశాలలో చేరమంటున్నరు
- కలెక్టర్‌కు మొరపెట్టుకున్న ఆర్డీ కళాశాల విద్యార్థినులు

హనుమకొండ, మే 12 : 'ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదు.. మీరు టీసీలు తీసుకొని వేరే కళాశాలలో చేరి చదువుకోండి' అని హనుమకొండలోని ఆర్డీ కళాశాల యాజమాన్యం అంటున్నదని పలువురు విద్యార్థినులు సోమవారం కలెక్టర్ ప్రావీణ్యకు తమ గోడు వినిపించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సోషల్ వెల్ఫేర్ శాఖ ద్వారా ఆర్డీ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో తమకు అడ్మిషన్ కల్పించారన్నారు. మొదటి సంవత్సరం అంతా సక్రమంగా జరిగి పరీక్షలు కూడా పూర్తయ్యాయని, ఇప్పుడు తమకు ప్రభుత్వం నుంచి డబ్బులు రావడం లేదని, తమకు కళాశాల నడపడం చాలా కష్టంగా ఉందని, మీరు టీసీలు తీసుకొని వేరే కళాశాలలో చదువుకోవాలని యాజమాన్యం అంటున్నదని తెలిపారు. దీంతో తమ చదువు మధ్యలోనే ఆగిపోయే ప్రమాదం ఉందని విద్యార్థినులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌తో మొర పెట్టుకున్నారు. స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య చదువు మధ్యలో ఆగిపోకుండా వేరే కళాశాలకు బదిలీ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు విద్యార్థినులు తెలిపారు.



కలెక్టరేట్‌కు వచ్చిన ఆర్డీ కళాశాల విద్యార్థినులు



నల్లబెల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

## కాకతీయ కళాసంపద కనుమరుగుకు యత్నం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను అడ్డుకుంటాం
- రేవంత్ సర్కారు ఇటీవల జియోలాజికల్ సర్వే చేపట్టడంలో ఆంతర్యమేమిటి?
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి, మే 12 : కాకతీయ కళాసంపదను కనుమరుగు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుటిల యత్నాలను తాము అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని, కాకతీయుల శిల్పసంపదతోపాటు సరస్సును లేకుండా చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏకమై చాపకింద నీరులా పావులు కదుపుతున్నాయని, దీనిని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామప్ప పరిసరాల్లో ఓపెన్‌కాస్ట్ గనిని ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తే తమ అధినేత, అప్పటి సీఎం కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. అంతేగాక దేవాదుల ఫేజ్ 3లో భాగంగా 9 టీఎంసీల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటు చేసి రామప్ప నుంచి పాకాల సరస్సు, రంగాయ చెరువులను గోదావరి జలాలతో నింపి నర్సంపేట నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. అయితే రామప్ప చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి ఓపెన్ కాస్ట్ మైనింగ్ చేపట్టొద్దనే నిబంధనలున్నప్పటికీ మోదీ సర్కార్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కై రామప్ప సరస్సుతోపాటు ఆలయాన్ని కనుమరుగు చేసేందుకు యత్నిస్తున్నారని, దీనికి ఇటీవల చేపట్టిన జియోలాజికల్ సర్వేనే నిదర్శనమన్నారు. ఇలాంటి చర్యలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని పెద్ది హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బానోత్ సారంగపాణి, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అరగంటలో రిజిస్ట్రేషన్

- వెనువెంటనే చేతికి డాక్యుమెంట్
- తాజాగా నాలుగు ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ ప్రారంభం
- తొలిరోజు 142 రిజిస్ట్రేషన్లు



స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి డాక్యుమెంట్ అందజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఫణిధర్, సబ్ రిజిస్ట్రార్ ఆనంద్

హనుమకొండ, మే 12 : సోమవారం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నాలుగు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అమలుచేసిన స్లాట్ బుకింగ్ విధానం ద్వారా మొత్తం 142 రిజిస్ట్రేషన్లు అయినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో జనగామ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో 25, స్టేషన్ ఘన్‌పూర్‌లో 22, వరంగల్ ఆర్వో ఆఫీసులో 71, నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో 24 రిజిస్ట్రేషన్లు జరిగి డాక్యుమెంట్లు సైతం అందజేశారు. స్లాట్ విధానం వల్ల గంటల తరబడి వేచి ఉండే అవసరం లేదు. సమయానికి క్రయ, విక్రయదారులు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లి అరగంటలో ప్రక్రియ పూర్తి చేసుకొని డాక్యుమెంట్ తీసుకొని వెళ్లవచ్చు. దీని వల్ల సమయం ఆదా కావడం, వెనువెంటనే డాక్యుమెంట్ చేతికొస్తుంది. పైలట్ ప్రాజెక్టుగా గత నెలలోనే వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇప్పటికే ప్రారంభించారు. జూన్ నుంచి ఉమ్మడి జిల్లాలోని మిగితా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రానున్నట్లు తెలిసింది. ఒక వరంగల్ ఆర్వో ఆఫీసులో తప్ప ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో ఒక్కొక్క దానిలో 48 రిజిస్ట్రేషన్లకు ఎక్కువ చేయరు. వరంగల్ ఆర్వో ఆఫీసులో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నందున 96 రిజిస్ట్రేషన్లకు పరిమితం చేసినట్లు అధికారులు తెలిపారు. అధికారులు రాత్రి వరకు ఉండాల్సిన పనిలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

హనుమకొండ చౌరస్తా, మే 12: కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ డీ విజయభాను సోమవారం తెలిపారు. 15, 16,17న 63 బస్సులు, 18న, 19న 70 బస్సులు, 20 నుంచి 24 వరకు 63 బస్సులు, 25, 26న 75 బస్సు సర్వీసులు నడుస్తాయని, మొత్తం 1,580 ట్రిప్పులు, హైదరాబాద్, హనుమకొండ నుంచి, పరకాల, భూపాలపల్లి, జనగామ, తొర్రూరు, నర్సంపేట, మహబూబాద్ డిపోల నుంచి నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ బస్సుల్లో ప్రత్యేక ఛార్జీలు ఉంటాయని, ప్రయాణికులందరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఆర్ఎం కోరారు.



కృష్ణాజిగూడెంలో తాగునీటి కోసం గ్రామపంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

## తాగునీటి కోసం మహిళల నిరసన

కృష్ణాజిగూడెంలో ఖాళీ బిందెలతో జీపీ ఎదుట ఆందోళన

చిల్పూరు, మే 12 : జనగామ జిల్లా చిల్పూరు మండలం కృష్ణాజిగూడెంలో తాగునీటి కోసం 7వ వార్డుకు చెందిన మహిళలు సోమవారం గ్రామ పంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మూడు రోజుల నుంచి తాగునీరు రావడం లేదని అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న మహిళలకు సీపీఎం చిల్పూరు మండల కార్యదర్శి సాదం రమేశ్ మద్దతు తెలిపారు.

నమస్తే ఎఫెక్ట్

### 'నమస్తే' వెబ్ కథనానికి స్పందించి.. సమస్యను పరిష్కరించి..

ఉదయం తాగునీటి సమస్యపై 'నమస్తే తెలంగాణ' వెబ్ పేజీలో కథనం రావడంతో సాయంత్రం అధికారులు స్పందించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సిబ్బంది వెంటనే 7వ వార్డులోని సీసీ రోడ్డు కింద ఇరుక్కుపోయిన గేట్‌వాల్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటిని అందించారు. గ్రామ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.






## పరిహారం కోసం మక్క రైతుల ధర్నా

### విత్తన కంపెనీలు పట్టించుకోవడం లేదని కలెక్టరేట్ ఎదుట ఆందోళన

ములుగురూరల్, మే 12 : విదేశీ విత్తనోత్పత్తి కంపెనీల ద్వారా నష్టపోయిన వెంకటాపురం (నూగూరు), వాజేడు మండలాలకు చెందిన మక్కజొన్న రైతులు పరిహారం ఇప్పించాలని సోమవారం ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. రైతులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న ఆదివాసీ నవ నిర్మాణ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి మాట్లాడుతూ రెండు మండలాల్లో సుమారు 900 మంది రైతులు మక్కజొన్న పంట ద్వారా తీవ్ర నష్టాన్ని చవిచూశారని అన్నారు. ఆయా కంపెనీల విత్తనాల ద్వారా పంట దిగుబడి రాక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని అన్నారు. ఎకరానికి రైతుకు రూ. లక్షా 50 వేల చొప్పున నష్టపరిహారం కంపెనీల ద్వారా అందించాలని అన్నారు. పంట నష్టంతో మృతి చెందిన, అనారోగ్యం బారిన పడ్డ రైతులకు ఎక్స్‌గ్రేషియా కింద విత్తన కంపెనీల నుండి కానీ, ప్రభుత్వం నుండి కానీ రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలపై ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించి రైతులకు భవిష్యత్‌లో అన్యాయం జరగకుండా చూడాలన్నారు. స్థానికులైన గూడ నర్సింహమూర్తి, మన్యం సురేశ్, ధనవనేని నాగరాజు, తన్నీరు రాంబాబు విత్తన కంపెనీలకు సూపర్‌వైజర్లుగా పనిచేసి రైతులను నట్టేట ముంచారని, వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు మోసాలకు పాల్పడిన ఆర్గనైజర్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మక్కజొన్న రైతులు